రాకపోకలకు నరకయాతన

- కూర్మన్నపాలెం ప్రధాన రహదారి గోతులమయం
- చిన్నపాటి వర్షానికే గోతుల్లో నిలుస్తున్న నీరు
- మురుగు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన



కూర్మన్నపాలెం ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

రోడ్డు పక్కన చెత్త కుండీ వద్ద మురుగు నీరు

వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారిన గొయ్యి

కూర్మన్నపాలెం : వేలాది మంది రాకపోకలు సాగించే కూర్మన్నపాలెం ప్రధాన రహదారి గోతులమయం కావడంతో ఉద్యోగులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా చిత్తడి చిత్తడిగా తయారైంది. రోడ్డు ఎక్కడికక్కడ గుంతలమయం కావడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఏ గుంతలో పడిపోతామోనని వాహనచోదకులు భయంతో హడలిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని విస్తరించేందుకు అధికారులు కాలువలు తవ్వించి వాటిని అలాగే వదిలేశారు.

ఫలితంగా కాలువలు అస్తవ్యస్తంగా మారడంతోపాటు పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయి వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. అలా నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచి పోవడంతో మురిగిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. వీటికితోడు నీరు నిల్వ ఉండిపోయిన గుంతలు కనిపించక చాలా మంది వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

చెత్త కుళ్లి దుర్వాసన

దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారు, ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కూర్మన్నపాలెం మెయిన్ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలి. రోడ్డు అధ్వానంగా మారి గోతులమయం కావడంతో అటుగా వెళ్లాలంటేనే వారంతా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆ రోడ్డులో ఉన్న ఒక పెద్ద షాపింగ్ మాల్ ముందు గొయ్యిలా ఏర్పడి భారీగా నీరు చేరిపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. సమీపంలోనే చెత్త కుండీ కూడా ఉండడంతో వర్షాలకు కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులతోపాటు స్థానిక వ్యాపారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై గోతులు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులందరూ కృషి చేయాలని పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి కోరారు. ఇటీవల పార్టీ నూతనంగా నియమించిన 78వ వార్డు అధ్యక్షుడు రావాడ శివ, రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.వరలక్ష్మి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా కార్యదర్శి ఎన్.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ గురువారం నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారిని అధిష్టానం గుర్తించి సముచిత పదవులు అప్పగించిందన్నారు. వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రమేష్‌కుమార్, దేముడు, కనికెళ్ల అమ్మాజీ, అర్జున్, శర్మ తదితదరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బలరామావతారంలో జగన్నాథస్వామి



అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలో జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామి వారు భక్తులకు గురువారం బలరామావతారంలో దర్శనమిచ్చారు. దశావతారాల్లో భాగంగా 7వ రోజు సుభద్ర, బలభద్రుని సహిత జగన్నాథస్వామిని బలరామ అవతారంలో అర్చకులు గురు సంతోష్ అలంకరించారు. ఆలయ ఈవో పద్మావతి, గురు త్రినాథ్, పండా కుటుంబీకులు, కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఐక్య వేదిక సమావేశం పోస్టర్ ఆవిష్కరణ



ఐక్య వేదిక సమావేశ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాసితులు

అగనంపూడి : విశాఖ ఉక్కు నిర్వాసిత అగనంపూడిలోని 16 కాలనీలకు చెందిన ఐక్య వేదిక సమావేశం ఈ నెల 6న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు విందుల చిరురాజు, గల్లా రామకృష్ణ తెలిపారు. ఐక్య వేదిక సమావేశ పోస్టర్‌ను అగనంపూడిలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 6న ఆదివారం సాయంత్రం పెదమడక మల్టీపర్పస్ హాలు వద్ద సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. 16 నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.వెంకటేష్, చిన్నారావు, అప్పలరాజు, బి.నారాయణరావు, బళ్ల పైడిరాజు, నరసింగరావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై విశాఖ విచ్చేసిన పీవీఎన్ మాధవ్‌కు స్వాగతం పలికేందుకు ఆ పార్టీ గాజువాక నాయకులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు స్థానిక లంకా మైదానం నుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా తరలివెళ్లారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ విశాఖకు చెందిన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, బాటా శ్రీను, సోంబాబు, శంకరరావు, నాగేశ్వరరావు, పేర్ల సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెదగంట్యాడ : పాలవలస 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాలవలస ఫీడర్ పరిధిలో మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలి దొడ్డి, గిన్నెవానిపాలెం, నక్కదొడ్డి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని... 18 సంవత్సరాలు నిండి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వసతి, స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309003957 లో సంప్రదించాలని కోరారు.

సోలార్ పవర్‌తో విద్యుత్ బిల్లుల ఆదా



మాట్లాడుతున్న ఈఈ బీకే నాయుడు

గాజువాక : గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు అన్నారు. చినగంట్యాడలోని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రంలో సోలార్ విద్యుత్‌పై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ పవర్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వినియోగదారులకు ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తోందన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడం వల్ల వినియోగదారులు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు పూర్తిగా ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, ఏపీఈపీడీసీఎల్ డీఈఈ పార్థసారథి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, చినగంట్యాడ సబ్ స్టేషన్ ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

22 మందికి హ్యుందాయ్‌లో ఉద్యోగాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ : గత 12 సంవత్సరాలుగా ప్రభుత్వ ఐటీఐతో ఎంఓయూ కొనసాగిస్తున్నామని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి తమ సంస్థలో ఉపాధి కల్పిస్తున్నామని హ్యుందాయ్ మోటార్స్ రీజినల్ హెడ్ మనోజ్ బోతమ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మోటార్ మెకానిక్ శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది విద్యార్థులకు గురువారం శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. హ్యుందాయ్ ఇండియా మోటార్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, ఐటీఐలో ఉప సంచాలకుడు ఆర్‌వీ రమణ, సంస్థ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కంపెనీ రాజమండ్రి, విశాఖపట్నం సర్వీస్ సెంటర్‌లో పని చేసేందుకు 22 మందికి ప్లేస్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఏడాది నుంచి పెయింటర్ ట్రేడులో శిక్షణ పొందిన వారికి కూడా తమ సంస్థలో ఉపాధి కల్పించేందుకు ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ కేఎస్ శ్రీనివాసరావు, ఎస్.ప్రతాప్, జావిద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విమల విద్యాలయంపై ప్రతిష్టంభన

- నేటికీ తెరుచుకోని పాఠశాల
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం తెరవడంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అన్ని పాఠశాలలు ప్రారంభమై సుమారు 20 రోజులు కావస్తున్నా ఈ పాఠశాల నేటికీ తెరవకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 12న పాఠశాల తెరవకపోవడంతో అప్పట్లోనే విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వివిధ రూపాల్లో ఆందోళన చేయడంతో యాజమాన్యంపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో గత నెల 23న ఉక్కు యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో పాఠశాలకు వచ్చే నిధులతో స్కూల్ నడపడానికి అంగీకరించారు. దాంతో సంబంధిత అనుమతి పత్రం ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. దీంతో పాఠశాల తెరుచుకుంటుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భావించారు. అయితే డీఈవో నుంచి అనుమతి పత్రం ఇంత వరకు రాలేదు. రాజకీయ ఒత్తిళ్ల వల్ల డీఈవో అనుమతి పత్రం ఇవ్వలేనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్లే పాఠశాల తెరుచుకోలేదని తెలిసి విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల ముందు ఆందోళన చేశారు. ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం శుక్రవారం సాయంత్రం లోగా హామీ పత్రం ఇవ్వకపోతే శనివారం ఉదయం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కార్పొరేటర్ బి.గంగారావు హెచ్చరించారు.

8వ వేతన సంఘం కమిటీ ఏర్పాటుకు ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: ఎనిమిదవ వేతన సంఘం కమిటీని తక్షణమే నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం నేవల్ డాక్‌యార్డ్ ఎంవోపీ గేట్ల వద్ద ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ నేతృత్వంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. రక్షణ రంగ సంస్థల ప్రధాన ద్వారాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు, బీపీఎంఎస్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టా విద్యాసాగర్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు మాట్లాడారు. అనంతరం సమాన స్థాయిలో ఉన్న నాన్ పిటిషనర్ ఉద్యోగులకు కోర్టు తీర్పుల ద్వారా న్యాయ రక్షణ అంశాల్ని విస్తరింపజేయాలని, హెచ్‌ఆర్‌ఏపై ఓవర్ టైం అలవెన్స్ లెక్కించాలనే అంశాలతో కూడిన వినతిపత్రాన్ని తూర్పు నావికాదళం సీసీపీవోకు అందజేశారు. తమ వినతిని ప్రధాని మోదీకి పంపాలని కోరారు. నిరసనలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు బి.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కోరుబిల్లి వెంకటనాయుడు, పి.సురేష్, అల్లిపిల్లి నరసింహరాజు, ఆడారి రమేష్, రవికుమార్, పి.రాజు, కె.వెంకటేశ్వరరావు, గోపీనాథరెడ్డి, గొన్న మహేష్, నొడగల శ్రీనివాసరావు, మోహనరావు, సాహూ, భాను, హరీష్‌బాబు, లోవరాజు, శేషు, రామకృష్ణ, బండారు శివ, కాసుబాబు, జగదీష్, చింతాడ రమణ, శ్రీనుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలపై యుద్ధానికి సిద్ధం

- 6న గాజువాకలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించాలి
- నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న విశాఖపట్నంలో జిల్లా స్థాయి సమావేశం, 6న నియోజకవర్గ స్థాయి సమావేశం కృష్ణదేవరాయలు జంక్షన్ (జగ్గు జంక్షన్)లోని గాజువాక క్లబ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. పెదగంట్యాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెడుతూ హామీలిచ్చారన్నారు. అప్పటి వరకు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతోపాటు మరో 143 పథకాలు అమలు చేస్తామని, సూపర్ సిక్స్ పేరిట మరో ఆరు పథకాలు అమలు చేస్తామని ఉదరగొట్టారన్నారు.

కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తయినా ఒక్క పథకమూ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. అందుకే చంద్రబాబునాయుడు ఇచ్చిన మోసపూరిత హామీలను వివరిస్తూ, రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో (తప్పుడు హామీలు ప్రజలకు గుర్తు చేయడం) పేరిట ప్రజల్లో చైతన్యం కల్పిద్దామని దేవన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని చెబుతూ, అదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు జరిగిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు నడుము బిగించాలన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయనంతగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్న పాలనలో ప్రజలకు లక్షల కోట్ల రూపాయల విలువ చేసే సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా, నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పార్టీ వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, మద్దాల అప్పారావు, గొందేశి శ్రీనివాసరెడ్డి, పెదిరెడ్ల ఈశ్వరరావు, పల్లా సురేష్, సంద్రాన నూకరాజు, కొణతాల రాము, భూపతిరాజు శ్రీనివాసరాజు, షౌకత్ ఆలీ, రావాడ శివ, మహాలక్ష్మినాయుడు, జి.పూర్ణానంద శర్మ, నాయకులు రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, గుడివాడ లతీష్, కోమటి శ్రీనివాసరావు, దాడి నూకరాజు, బొడ్డ గోవింద్, రంభ నారాయణమూర్తి, జీలకర్ర నాగేంద్ర, గొందేశి వెంకటరమణారెడ్డి, గౌస్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు ప్రారంభం




రేషన్ డిపో ప్రారంభిస్తున్న లతీష్

గాజువాక : పౌర సరఫరాల శాఖ సర్కిల్ అధికారులు 68వ వార్డులో రెండు రేషన్ డిపోలు ఏర్పాటు చేశారు. వీటిని ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ లతీష్ గురువారం ప్రారంభించారు. రేషన్ వాహనాల విధానం (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ద్వారా ప్రజల చెంతకు రేషన్ పంపిణీ చేసే వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంగా రాజీవ్‌నగర్, గిరి ప్రసాద్ కాలనీ, కాళికానగర్ ప్రజలు రేషన్ తీసుకోవడానికి అవస్థలు పడుతున్నట్టు తెలుసుకున్న లతీష్ సర్కిల్ – 3 ఏఎస్‌వో, డీఎస్‌వోతో మాట్లాడి నెలకు 15 రోజులపాటు ఈ కాలనీలకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ డిపోలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వాటిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: నగరానికి చెందిన గాయనీ గాయకులు శోభన్‌బాబు నటించిన చిత్రాలలోని గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. వెంకీ రిథమ్స్ సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ సినీ సంగీత విభావరిని నిర్వహించింది. గాయనీ గాయకులు వెంకటేష్, బాబ్జి, ఎ. నరసింగరావు, రమేష్, కృష్ణంరాజు, రంజిత, సుజాత, జ్యోతి, మాధురి సినీ గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.

రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి



రైల్వేస్టేషన్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి, ఆటో డ్రైవర్స్

తాటిచెట్లపాలెం: ఈనెల 9న దేశ వ్యాప్తంగా జరగనున్న రవాణా రంగ సమ్మెను విశాఖలోని రవాణా రంగ కార్మికులు జయప్రదం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వామనమూర్తి మాట్లాడుతూ, ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌సీ, సెన్సార్ డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే వాహనమిత్ర కింద ఆటో డ్రైవర్లకు వెంటనే రూ. 15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ చట్టం (సెక్షన్ 106(2))ను రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మోటార్ రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మెకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొని మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, జై గణేష్ కుమార్, రవి, కృష్ణ, సత్తిబాబు, చిన్న అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రైస్తవ దినోత్సవం



క్రైస్తవ దినోత్సవంలో పాల్గొన్న జూపూడి ప్రభాకర్ తదితరులు

గాజువాక : జాతీయ క్రైస్తవ దినోత్సవాన్ని గాజువాకలో క్రైస్తవ సంఘాలు, సేవకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు తుంగ్లాంలోని ఎంహెచ్‌జీసీ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ లోపింటి సామ్యూల్ ఆధ్వర్యంలో క్రైస్తవ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ దేశ క్షేమం కోసం, అభివృద్ధి కోసం క్రైస్తవ సేవకులు, సంఘాలు ఎల్లప్పుడూ ప్రార్థనలు చేస్తున్నారన్నారు. భారతదేశ క్రైస్తవ దినోత్సవాన్ని 2021లో ప్రకటించినందుకు క్రైస్తవ సమాజం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.జార్జిబాబు, కె.సామ్యూల్ సాంబ, కింగ్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

మహారాణిపేట: విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీ బాబు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో నిర్వహించిన ర్యాగింగ్, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీడీ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని చట్టంలో స్పష్టంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాంజలి, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ భవానీ, హాస్టల్ వార్డెన్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.